క్లుప్తంగా

మల్లన్నను దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



మల్లన్న దర్శనానికి వెళ్తున్న హైకోర్టు జడ్జి వెంకట జ్యోతిర్మయి దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం ఉదయం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు మల్లికార్జున స్వామి వారికి అభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద గల ఆశీర్వచన మండపంలో న్యాయమూర్తి దంపతులకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

ఆరోగ్య సురక్షతో ప్రజల వద్దకే వైద్యం



బొల్లవరంలో రోగులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న అధికారులు, నాయకులు

నందికొట్కూరు రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఇంటి వద్దకే వైద్యం అందుతుందని బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీ వైద్యురాలు తులసి అన్నారు. శనివారం మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మెడికల్ క్యాంపును నిర్వహించారు. శిబిరంలో 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, ఈఓఆర్డీ సంజన్న, పంచాయతీ కార్యదర్శి నూరుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీల రాష్ట్ర మహాసభలకు తరలిరావాలి

వెలుగోడు: ఫిబ్రవరి 4న విజయవాడలో నిర్వహిస్తున్న గ్రామీణ వైద్యుల సమాఖ్య(ఆర్‌ఎంపీ) రాష్ట్ర మహాసభకు తరలిరావాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రొక్కం నాగేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను జిల్లా ఉపాధ్యక్షుడు బాలుడు, మండల అధ్యక్షుడు పి.నాగశేషులతో కలసి విడుదల చేశారు. రొక్కం నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర మహాసభలో క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు తొలగించడంపై చైతన్యవంతం చేస్తారని తెలిపారు. గ్రామీణ వైద్యుల మహాసభకు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు, కమ్యూనిటీ పారా మెడికల్ సిబ్బంది తరలిరావాలని కోరారు. స్థానిక కూడలిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆ సంఘం నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీలు జాకీర్ హుస్సేన్, అమీర్, మునిరుద్దీన్ ఖాజాహుస్సేన్, వలి, రాజప్ప, జయశంకర్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న ప్రిన్సిపాల్ రఫీ

మహానంది: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల వెలుగోడులో నిర్వహించిన ఆల్ ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్షియల్ లిటరసీ పోటీల్లో బండిఆత్మకూరు మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ సయ్యద్ అబ్దుల్ రఫీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వెంకటసాయి ప్రణతి, సాజిదా మొదటి స్థానంలో నిలిచి ఒక్కొక్కరు రూ. 5,500 చొప్పున నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు చెప్పారు.

కానిస్టేబుల్‌కు అభినందనలు

శ్రీశైలంటెంపుల్: ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాన్ని అందుకున్న శ్రీశైలం కానిస్టేబుల్ శ్రీకాంత్‌ను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, ఎస్‌ఐ లక్ష్మణరావు, తోటి కానిస్టేబుళ్లు శనివారం అభినందించారు. శ్రీశైలం ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్ ఎస్.శ్రీకాంత్ ఆత్మకూరు సబ్ డివిజన్ కోర్టు లైజనింగ్ ఆఫీసర్‌గా నిర్వర్తించిన ఉత్తమ విధులకు గాను నంద్యాల జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జేసీ చేతుల మీదుగా శుక్రవారం నంద్యాలలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన గణతంత్రదినోత్సవ వేడుకల్లో ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే క్రీడాపోటీలు

- రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి
- అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- అట్టహాసంగా నియోజకవర్గ స్థాయి ఆడుదాం–ఆంధ్ర ముగింపు వేడుకలు

ఆత్మకూరు : గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకే ఆడుదాం–ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి ముగింపు ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని యువతలో దాగివున్న క్రీడానైపుణ్యాలను వెలుగులోకి తెచ్చేందుకు క్రీడలను ప్రారంభించారన్నారు. ఆత్మకూరు క్రీడాకారులకు పుట్టినిల్లు అని, ఇక్కడి నుంచి ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాపోటీలలో పాల్గొన్నారన్నారు. నియోజకవర్గ స్థాయి పోటీలలో విజేతలకు షీల్డ్, మెమొంటోలను అందజేశారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు.

విజేతలు వీరే..

బాల్‌బ్యాడ్మింటన్ నియోజకవర్గ స్థాయిలో మొదటి విజేతగా ఆత్మకూరు జట్టు, రెండో విజేతగా వెలుగోడు, మూడో విజేతగా మహానంది మండల జట్లు నిలిచాయి. వాలీబాల్ పోటీల్లో మొదటి బహుమతి ఆత్మకూరు, రెండో బహుమతి మహానంది, మూడో బహుమతి బండి ఆత్మకూరు, కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి వెలుగోడు మండల జట్టు, రెండో బహుమతి మహానంది, మూడో బహుమతి ఆత్మకూరు జట్లు అందుకున్నాయి. ఖోఖోలో మొదటి విజేత ఆత్మకూరు, రెండో స్థానంలో మహానంది, మూడో స్థానంలో వెలుగోడు జట్లు గెలుపొందాయి. బాలికల విభాగంలో బాల్‌బ్యాడ్మింటన్ మొదటి బహుమతి ఆత్మకూరు, రెండో బహుమతి వెలుగోడు, మూడో బహుమతి మహానంది, వాలీబాల్‌లో మొదటి బహుమతి వెలుగోడు, రెండోబహుమతి ఆత్మకూరు, మూడో బహుమతి మహానంది సాధించాయి. కబడ్డీలో మొదటి స్థానంలో ఆత్మకూరు, రెండో స్థానంలో వెలుగోడు, మూడో స్థానంలో మహానంది జట్లు నిలిచాయి.

ధోబీఘాట్ సమస్య పరిష్కారానికి ఆదేశాలు

ఆత్మకూరు పట్టణ సమీపంలోని భవనాశి వాగువద్ద ఉన్న ధోబీఘాట్‌కు చెందిన ఏళ్ల నాటి సమస్యను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. రజకులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా బోర్లకు మరమ్మతులు, కొత్తబోరు, విద్యుత్ స్తంబాలు, వీధి దీపాలు, నీటిసమస్యతో పాటు రహదారి సమస్యను కూడా పరిష్కరించాలని పట్టణంలోని రజకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ధోబీఘాట్‌ను పరిశీలించి సమస్యను పరిష్కరించేందుకు అక్కడికక్కడే మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఉమాదేవిలకు ఆదేశాలు జారీ చేశారు. సత్వరమే ఈ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

పట్టణంలో ఫౌజియా, కరీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఒక్కో విద్యార్థికి రూ.వెయ్యి చొప్పున 50 మందికి అందజేశారు. కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యాద్ మీర్, రాజమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయచౌదరి, పువ్వాడ భాస్కర్, భోగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటస్వామి గౌడ్, రమణ, వరాలమాలిక్, ఫౌండేషన్ నిర్వాహకులు కరీమ్, సుల్తాన్, రమణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచారులు, పీఈటీ దేవానందం, విజయ్, ఆంజనేయులు, శ్రీనివాసులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

కబడ్డీ విజేత రేగడగూడురు కలాం జట్టు

వెలుగోడు: ఆడుదాం ఆంధ్ర కబడ్డీ పోటీల్లో రేగడగూడురు జట్టు నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరిచింది. నియోజకవర్గ స్థాయి పోటీల్లో మహానంది జట్టుపై గెలుపొందింది. ఈ మేరకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రేగడగూడురు కలాం జట్టుకు శనివారం రూ.35 వేల నగదును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ యువకుల్లోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. రేగడగూడూరు జట్టు జిల్లా స్థాయిలో కూడా ప్రతిభ కనబరచి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, రేగడగూడురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.



కబడ్డీ జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే

జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్

జూపాడుబంగ్లా: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తున్నట్లు తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 11 జగనన్నలే అవుట్లలో 1,462 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాల పట్టాలు మంజూరు చేశామన్నారు. వాటికి సంబంధించి నేటి నుంచి గ్రామసచివాలయాల్లో ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. దీంతో జగనన్నకాలనీల్లో ఇళ్లస్థలాలు పొంది ఇళ్లు కట్టుకున్న వారికి సర్వహక్కులు వర్తిస్తాయని తెలిపారు. ఎవరిపేరున అయితే ఇంటిస్థలం పట్టా మంజూరు చేసి ఉంటారో వారి పేరున మాత్రమే ఉచితంగా ఇంటిస్థలం రిజిస్ట్రేషన్ చేసిస్తామన్నారు. లబ్ధిదారులు పదేళ్ల వరకు జగనన్న కాలనీల్లోని స్థలాలను అమ్మటం, కొనడం చేయరాదన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఇంటిస్థలాలు పొందిన వారు సత్వరమే ఇళ్లు నిర్మించుకోవాలన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక ఎదుగుదల

నందికొట్కూరు: పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో ఆర్థికంగా ఎదుగుతారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా దామోదర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో బీజేపీ తరుపున ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్టానం ఎవరిని ప్రకటించినా గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న సుంకన్న, కార్యదర్శి రవికుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలకు పెద్ద పీట

- చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి
- పట్టణంలో 12, 13, 14, 16, 17, 27 వార్డులో నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు
- సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న చైర్మన్, కమిషనర్, పొదుపు మహిళలు

నందికొట్కూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు పెద్ద పీట వేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ముబారక్ ఫంక్షన్ హాల్‌లో 12, 13, 14, 16, 17, 27వ వార్డులకు చెందిన 133 పొదుపు సంఘాలకు నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందజేశారు. వారితో కలిసి సీఎం వైఎస్ జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. పొదుపు మహిళలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ పెద్ద ఎత్తున్న నినాదాలు చేశారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ అక్కాచెల్లెమ్మలకు మేలు చేసింది జగనన్న ప్రభుత్వమేనన్నారు. పేదల సొంతింటి కల సాకారం చేసి చరిత్రలో నిలిచిన సీఎం వైఎస్ జగనన్న ఒక్కరేనని చెప్పారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మోసం చేసిన చంద్రబాబు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, చేయూత వంటి సంక్షేమ పథకాలు పేద మహిళల ఆర్థిక స్వావలంబనతో పాటు కుటుంబాన్ని ఆర్థిక ప్రగతి నడిపిస్తున్నాయన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం నాల్గవ విడత కింద 133 పొదుపు గ్రూపులకు రూ. 85,22,017 మహిళలకు లబ్ధి చేకూరిందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు లాలు, రవూఫ్, అశోక్, మెప్మా సీఎంఎం శాంతకుమారి, సీఓలు అర్చన, వినయ్‌కుమార్, లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు ఉస్మాన్‌బేగ్, పట్టణ నాయకులు రమేష్, పట్టణ సమాఖ్య ప్రెసిడెంట్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ యశస్విని

మహానంది: ప్రజా సమస్యలకు అధికారులు ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మహానంది మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని తెలిపారు. మండల కేంద్రమైన తిమ్మాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాబోయే వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో నిర్లక్ష్యం వహించకుండా అరులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని కోరారు. గ్రామాల్లోని సమస్యలను మొదటి ప్రాధాన్యతగా గుర్తించాలన్నారు. వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా రైతులు వర్షాధార పంటలను కాకుండా మంచి ఫలితాలను ఇచ్చే అపరాల సాగుపై మొగ్గు చూపాలన్నారు. రైతులకు కావలసిన అన్ని రకాల ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ జనార్దనశెట్టి, ఎంపీడీఓ శివ నాగజ్యోతి, విద్యుత్ శాఖ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాఘ మాసంలో మినీ కల్యాణ మండప నిర్మాణం

మహానంది: మహానందీశ్వర స్వామి భక్తుల సౌకర్యార్థం దేవస్థానం సిబ్బంది ఆధ్వర్యంతో మినీ కల్యాణ మండప నిర్మాణాన్ని మాఘమాసంలో ప్రారంభిస్తామని మహానంది దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవిశంకర అవధాని తెలిపారు. దేవస్థానంలోని అలంకార మండపంలో శనివారం సాయంత్రం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వేదపండితులు, అధ్యక్షుడు రవిశంకర అవధాని మాట్లాడుతూ సుమారు 50 మంది దేవస్థానం పర్మినెంట్ ఉద్యోగులకు సంబంధించిన పీఆర్సీ అరియర్స్‌లో సగం మొత్తం వెచ్చించి ఆలయ కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు ఆలయాభివృద్ధిలో భాగంగా మినీ కళ్యాణ మండపం నిర్మించేందుకు ముందుకు వచ్చారన్నారు. ఈ మేరకు మాఘమాసములో నిర్మాణం ప్రారంభించేందుకు తీర్మానించామని చెప్పారు. 42ఏళ్ల పాటు ప్రసాదాల తయారీ విభాగంలో పనిచేసిన హెచ్‌జే కుమార్ ఈ నెల 31న పదవీ విరమణ చేస్తున్నారన్నారు. సమావేశంలో ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ప్రధానార్చకులు అర్జునశర్మ, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దనశర్మ, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో చర్చిస్తున్న అధ్యక్షుడు, ప్రతినిధులు

వైద్యురాలికి గాయాలు

మహానంది : తిమ్మపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శాంతిప్రియకు రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. శనివారం నంద్యాల నుంచి తిమ్మాపురం ఆరోగ్య కేంద్రానికి వస్తుండగా నంద్యాలలోని ఆత్మకూరు బస్టాండు మలుపువద్ద ఇన్నోవా వాహనం ఢీకొంది. దీంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి.

గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలి
- గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన సీఎం వైఎస్ జగనన్న
- ఆయనను మళ్లీ సీఎంగా గెలిపించుకుందాం



వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 20 వార్డుకు చెందిన కాంగ్రెస్, టీడీపీ పార్టీల నుంచి బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. చికెన్ రఫితో పాటు షఫి, అబ్దుల్లా, నజీర్, బాబు, నూర్, అద్రీమ్, చాంద్, మన్సూర్, అన్వర్‌లకు సిద్ధార్థరెడ్డి కండువా కప్పి వైఎస్సార్‌సీపీలో ఆహ్వానించారు. జై జగన్, జై, జై జగన్ అంటూ పెద్ద ఎత్తున్న నినాదాలు చేశారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు కల్లబొల్లి మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రజలను సొంత కుటుంబంలా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూసుకుంటున్నారన్నారు. హామీలిచ్చి మోసాలు చేసిన చంద్రబాబు మళ్లీ ఓట్లు అడిగేందుకు వస్తాడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు కులగణన కార్యక్రమానికి జగనన్న ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని స్పష్టం చేశారు. మన పిల్లలకు అంతర్జాతీయ విద్య అందించాలంటే మళ్లీ జగనన్న సీఎం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఒక పైసా లంచం లేకుండా ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమన్నారు. నవనందుల కోట నందికొట్కూరు నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు హమీద్, చాంద్‌బాషా, నాయబ్, కృష్ణ, లాలు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు ఉస్మాన్‌బేగ్, అబుబక్కర్, ఆర్టీసీ బాబు, అబ్దుల్లా, రామకృష్ణ, శాలు, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

జూపాడుబంగ్లా: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త కష్టసుఖాల్లో పాలుపంచుకొని వారికి అండగా ఉంటానని శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తరిగోపుల గ్రామానికి చెందిన గొల్లసురేష్ తండ్రి గొల్లకృష్ణుడు(55) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిద్ధార్థరెడ్డి గ్రామానికి చేరుకొని మృతుడికి నివాళులర్పించారు. అనంతరం సురేష్, కుటుంబసభ్యును పరామర్శించారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

పగిడ్యాల: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసానిస్తూ.. ప్రజల చెంతకే నిపుణులైన వైద్యులను పంపి వైద్యం అందిస్తోందని సర్పంచ్ రాజేశ్వరి అన్నారు.. శనివారం మండలంలోని నెహ్రూనగర్ సచివాలయం 1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడుత క్యాంప్‌ను నిర్వహించారు. శిబిరంలో జనరల్ సర్జన్ అనంతయాదవ్, గైనకాలజిస్టు ప్రసన్న లక్ష్మి, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మోహన్, అనిల్‌కుమార్ 538 మంది రోగులకు వైద్య సాయం అందించారు. శిబిరాన్ని ఎంపీడీఓ వెంకటరమణ పర్యవేక్షించి పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్ ఓ రామగుర్రప్ప, పీహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మి, హెల్త్‌సూపర్‌వైజర్ శివగౌరీ తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు ఎంపీడీఓ బదిలీ

మహానంది: బండిఆత్మకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పని చేస్తున్న వాసుదేవ్ గుప్తను అనంతపురం జిల్లాకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 42 మంది ఎంపీడీవోలను అనంతపురం, వైఎస్ఆర్ జిల్లాలకు బదిలీ చేశారు.

100 శాతం సర్వే పూర్తి చేయాలి

కొత్తపల్లి: గ్రామాలలో కులగణన సర్వే 100 శాతం పూర్తిచేయాలని ఎంపీడీఓ మేరి శనివారం సూచించారు. మండలంలో 11 గ్రామ సచివాలయాల పరిధిలో 32 గ్రామాలలో గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కులగణన సర్వే చేస్తున్నారని చెప్పారు. శనివారం సాయంత్రానికి అన్ని గ్రామాలలో 83 శాతం సర్వే పూర్తిచేశారని వివరించారు. చివరితేదీ కావడంతో రాత్రిలోగా 100 శాతం సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు.

బీజేపీకి బుద్ధి చెప్పండి

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో శనివారం సీపీఎం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రత్యేక హోదాతో పాటు పలు హామీలను అమలు చేయడంలో విఫలమయ్యిందన్నారు. చివరకు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కూడా ప్రైవేటీకరణ చేసేందుకు బీజేపీ ప్రభుత్వం పునుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఏసురత్నం, స్వామన్న, నాగేశ్వరరావు, రణధీర్, నాగరాజు, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

అవి-ఇవి

నేడు ఐలమ్మ విగ్రహావిష్కరణ

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆదివారం నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ఆవిష్కరించనున్నట్లు రజక సంఘం రాష్ట్ర మాజీ నాయకుడు బస్తిపాటి మౌలాలి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రజకులు ఐక్యమత్యంగా చందాలు పోగుచేసుకొని విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ విగ్రహాన్ని ఎమ్మెల్యేతో పాటు ఐలమ్మ మనుమడు రామచంద్ర చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రజకులు తరలిరావాలని కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మహానంది: గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మహానంది ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ హెచ్చరించారు. బుక్కాపురం గ్రామానికి చెందిన కే.వెంకటేశ్వర్లును శనివారం అరెస్ట్ చేసి 38 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టు షాపులు, నాటుసారా విక్రయాలపై సమాచారం అందించాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

ప్రభుత్వ వైద్యశాలను ప్రారంభించాలి

జూపాడుబంగ్లా: నూతన ప్రభుత్వ ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలని సీపీఐ పార్టీ నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం నూతన ఆసుపత్రి భవనం వద్ద ఆందోళన నిర్వహించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం రూ.1.80కోట్ల నిధులు వెచ్చించి నిర్మించిన నూతన భవనాన్ని ఇప్పటిదాకా ప్రారంభించకపోవటంతో ప్రస్తుతం ఉన్న ఇరుకైన భవనంలో ప్రజలకు వైద్యులు మెరుగైన వైద్యం అందించలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో నరసింహ, మగ్బుల్‌బాషా, మధు, యోహాన్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వీకెండ్ సందడి

మహానంది: శనివారం వీకెండ్ కావడంతో మహానంది ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. ఆలయానికి వచ్చిన భక్తులు రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, అర్చన పూజలు చేపట్టారు. బండిఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారంలో శనివారం భక్తుల సందడి కనిపించింది. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ ఉమా సమేత ఓంకార సిద్దేశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజలు చేపట్టారు. స్థానిక కాశిరెడ్డినాయన నిత్యాన్నదాన ప్రసాదం స్వీకరించారు.

ఆటలతో ఆరోగ్యం



మహిళా కబడ్డీలో విన్నర్‌గా నిలిచిన మిడుతూరు జట్టు



మహిళా వాలీబాల్‌లో విన్నర్‌గా నిలిచిన పగిడ్యాల మండలం జట్టు

నందికొట్కూరు: ఆటలతో ఆనందంతో పాటు ఆరోగ్యం అభివృద్ధి చెందుతుందని గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్షావలి అన్నారు. ఆడుదాం...ఆంధ్ర క్రీడలు రెండోవ రోజు శనివారం హోరాహోరీగా సాగాయి. క్రీడాకారులను ప్రిన్సిపాల్ షేక్షావలి పరిచ యం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ప్రత్యర్థి జట్టుపై ఆధిపత్యం సాధించేందుకు బాలబాలికలు పోటాపోటీగా తలపడ్డారు. నియోజకవర్గ స్థాయిలో బాలికల విభాగంలో మిడుతూరు మండల కబడ్డీ జట్టు విన్నర్‌గా నిలవగా, నందికొట్కూరు మండల జట్టు రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్‌లో పగిడ్యాల జట్టు విన్నర్‌గా నిలవగా, నందికొట్కూరు రన్నర్‌గా నిలిచింది. ఖో, ఖో లో హోరాహోరీగా తలపడి పాముల పాడు జట్టుపై పగిడ్యాల జట్టు విజయసాధించింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రాథమిక స్థాయి నుంచి ఆటల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. యువతలోని క్రీడా నైపుణ్యతను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం..ఆంధ్ర క్రీడలను నిర్వహిస్తోందని చెప్పారు. కొత్తపల్లి జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపుతో పాటు విద్యా, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. నంద్యాల, కర్నూలు జిల్లాల శాప్ కో ఆర్డినేటర్లు రవికుమార్, శ్రీనాథ్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ డోరతి, మండలాల కో ఆర్డినేటర్లు వీరన్న, కృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రాజశేఖర్, మురళీ, ఫిజికల్ డైరెక్టర్లు పద్మలత, జయమ్మ, జేసింతా, విజయ కుమారి పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడాకారులకు వరం

కొత్తపల్లి: మీణ క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్ర వరమని జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం నందికొట్కూరులో కొత్తపల్లి మండల వాలీబాల్ టీమ్‌ను అభినందించారు.కొత్తపల్లి మండలం నుంచి దుద్యాల గ్రామం వాలీబాల్ టీమ్ ఉత్తమ ప్రతిభ కనపరడంపై హర్షం వ్యక్తంచేశారు. శనివారం జూపాడుబంగ్లా తో సెమిఫైనల్‌లో తలపడి విజయం సాధించిందని, సోమవారం జరిగే ఫైనల్‌లో ఉత్తమ ప్రతిభ కనపరిచి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. దుద్యాల సర్పంచు శోభలత, వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు మురళీనాయక్, చంద్రశేఖర్, సుంకన్న నాయక్, రీనాబేగం, స్వప్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.